ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రంగారెడ్డి

జిల్లా వార్తలు

5

శనివారం 21 సెప్టెంబరు 2024





కుచించుకుపోయిన ఒడ్లవాని కుంట

రియల్టర్ల ధన దాహానికి వ్యవసాయానికి ఆదెరువైన చెరువులు, కుంటలు మాయమవుతున్నాయి. ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడుతూ ప్లాట్లుగా మార్చుతున్నారు. వరద నీరు పారే కాలువలను సైతం ధ్వంసం చేసి వెంచర్లలో కలిపేసుకుంటున్నారు. మనల్నెవడ్రా ఆపేది అనే తీరుగా జలాశయాలను చెరబడుతున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో రోడ్డు మధ్య ఉన్న స్ట్రీట్‌లైట్ ప్రమాదకరంగా ఉంది. లైట్ స్తంభానికి వేలాడుతూ రోడ్డుపై వెళుతున్న వారిపై ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు లైటును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

మింగేశారు!

- చెరువులను చెరపడుతున్న రియల్టర్లు
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో యథేచ్ఛగా ప్లాట్లు
- పూర్తిగా కుచించుకుపోయిన ఒడ్లవాని కుంట
- పట్టించుకోని అధికారులు



ఒడ్లవాని కుంట

ఆదిభట్ల, సెప్టెంబరు 20 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామం రెవెన్యూ సర్వే నెంబర్ 346, 347, 348, ఫిరోజ్‌గూడ సర్వే నెంబర్ 84లో ఆరు ఎకరాలలో ఒడ్లవానికుంట (ఒడ్లోనికుంట) విస్తరించి ఉంది. కొంగరకలాన్ గ్రామంలోని గొలుసుకట్టు చెరువులలో ఒకటైనా ఈ ఒడ్లవాని కుంట కింద సుమారు 9 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఇది నిండితే పంటలు పుష్కలంగా పండుతాయి. అలాంటి జలాశయం రియల్టర్ల పుణ్యమా అని అస్థిత్వం కోల్పోయే పరిస్థితి నెలకొన్నది. కలెక్టరేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫాక్స్‌కాన్ సంస్థకు ఆనుకుని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 15 ఎకరాలలో వెంచర్ ఏర్పాటు చేసింది. ప్లాట్లు చేసి బీటీ రోడ్డు వేసింది. కలెక్టరేట్ సమీపంలో ప్లాట్లు అని జోరుగా ప్రచారం చేసి అమాయకులకు వాటిని అంటగట్టారు. సదరు సంస్థ ప్లాట్లు చేసే క్రమంలో ఏకంగా ఒడ్లవాని కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని సుమారు రెండు ఎకరాల భూమిని ఆక్రమించారు. దీంతో ఒడ్లవాని కుంట పూర్తిగా కుచించుకుపోయింది. ఈ చెరువును చెరబట్టే క్రమంలో వర్షపు నీరు వచ్చే వాటర్ చానల్‌ను కిలోమీటర్ల మేర పూర్తిగా ధ్వంసం చేశారు.

గతంలో నిండుకుండలా..

ఒడ్లవానికుంట ఆరు ఎకరాల శిఖంతో విశాలమైన నీటి వనరుగా ఉండేది. వర్షాకాలంలో నిండుకుండలా ఉండేది. చెరువు నిండిన తరువాత అలుగు పారి దానికింద ఉన్న కొత్త చెరువులోకి నీరు వచ్చేది. కొత్త చెరువు కింద 15.298 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఈ రెండు చెరువులలో నీరు పుష్కలంగా ఉండటంతో జీవాలకు తాగునీటి సమస్య ఉండేది కాదు. అప్పట్లో పంటలు కూడా పుష్కలంగా పండేవి. ప్రస్తుతం రియల్టర్ల వరద పారే కాలువను ధ్వంసం చేయడంతో కుంటలోకి నీరు రావడం లేదు. దీంతో ఎప్పుడూ నిండుకుండలా ఉండే ఒడ్లవానికుంట, కొత్తచెరువు ప్రస్తుతం నీరు లేకపోవడంతో వెలవెలబోతున్నాయి.

వాటర్ చానల్‌నూ వదల్లేదు..

చెరువును చెరపట్టే క్రమంలో రియల్టర్లు ముందుగా వాటర్ చానల్‌పై దృష్టి పెట్టారు. మహేశ్వరం మండల శివారు ప్రాంతాల నుంచి ఒడ్లవాని కుంటకు వర్షపు నీరు వచ్చే ప్రధాన నీటి కాలువను వెంచరులో కలుపుకునేందుకు దానిని ధ్వంసం చేశారు. కలెక్టరేట్ మెయిన్ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్న ఈ వెంచర్ ఏర్పాటులో చెరువులోని వర్షం నీరు వచ్చే ప్రధాన కాలువను కలుపుకున్నారు. వర్షాకాలంలో మీటర్ల విస్తీర్ణంలో వాగులా ప్రవహించే నీటి కాలవను కేవలం మూడు ఫీట్లకు కుచించి కాంక్రీట్ కాలువ నిర్మించారు.



ఒడ్లవాని కుంట వాటర్ చానల్ దుస్థితి



చెరువులను ఆక్రమిస్తే కఠినంగా శిక్షించాలి

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఆక్రమించి వెంచర్ వేస్తే రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి. ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సిన పార్కు స్థలం లాంటివి పూర్తిగా బఫర్ జోన్‌లో వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. 2022లో హెచ్‌ఎండీఏలో ఫిర్యాదు కూడా చేశాం. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదు.

నర్సగళ్ల ప్రవీణ్, కొంగరకలాన్, ఆదిభట్ల మున్సిపాలిటీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రాజేశ్వర్ తివారి

కడ్తాల్, సెప్టెంబరు 20: ప్రకృతి, పర్యావరణం, జీవరాశుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలంగాణ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారి అన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే మానవాళి మనుగడకు ప్రమాదమని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని దిఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ మూడో బ్యాచ్ అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సులో నల్లగొండ, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, నల్లగొండ డీఎస్‌వో లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం రాజేశ్వర్ తివారి మాట్లాడుతూ జీవ వైవిధ్య ప్రాముఖ్యతను ప్రతీ పౌరుడు గుర్తించాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ సభ్యులు డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్ రెడ్డి, పర్యావరణ ఉద్యమ కారులు సురేశ్ గుప్తా, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీజీఆర్ ప్రతినిధులు అన్నమయ్య, అనుదీప్, నగేశ్, రజనికాంత్, లక్ష్మీప్రసన్న, హరితదేవి, రవి, శంకరయ్య పాల్గొన్నారు.

మోస్తరు నుంచి భారీ వర్షం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఈనెల మొదటి వారంలో ఎడతెరిపి లేని వర్షం కురిసిన విషయం విదితమే. వారం రోజులు గ్యాప్ ఇచ్చిన వాన మళ్లీ కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. మహేశ్వరం మండలం ఇండస్ట్రియల్ పార్కు సమీపంలో కురిసిన భారీ వర్షానికి 41.8 మిల్లీమీటర్ల వర్షపాత నమోదైంది. అలాగే మహేశ్వరంలో 39.5 మిల్లీమీటర్లు, బాలాపూర్ మండలంలో 33.5, మామిడిపల్లిలో 28.3 మి.మీ, శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులో 20.3 మి.మీ. కందుకూరు మండలంలో 16.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం యాలాలలో 37.8 మిల్లీమీటర్లు, మర్పల్లిలో 29.8 మిల్లీమీటర్లు, బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో 22.8, బంట్వారంలో 17.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

శంకర్‌పల్లిలో...

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి తోపాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు 30 నిమిషాల పాటు కుండపోత వర్షం కురిసింది. ఈ వాన వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలకు ఎంతగానో ఉపయోగకరమని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.



కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ వద్ద కురుస్తున్న వర్షం

✦ బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 20 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి పెంచాలని తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఇంత వరకు కులగణన చేపట్టలేకపోయిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 214 జూనియర్ కాలేజీలు, 82 డిగ్రీ కాలేజీలు, 255 వృత్తి విద్యా కాలేజీలు ఉండగా ఇందులో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు, మెస్‌చార్జీలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : ప్రతీ ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు అన్నారు. హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, స్క్రీనింగ్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 వరకు ఈ ప్రాణాంతకమైన వ్యాధులను అంత మొందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు కృషి చేయాలని తెలిపారు. అనుమానితులకు టెస్టులు నిర్వహించి వెంటనే హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దిశ మేనేజర్, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ రమేష్, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రోడ్డుపై సంత.. వాహనదారులకు చింత



కేశంపేట, ఆమనగల్ ప్రధాన రహదారిపై కూరగాయల విక్రయం

- ✦ రైతు బజారు లేక ఇక్కట్లు
- ✦ రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- ✦ సంతరోజు ఫుల్ ట్రాఫిక్

కేశంపేట, సెప్టెంబరు 20: రైతు కష్టించి పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. రైతుబజారు అందుబాటులో లేకపోవడంతో రోడ్డుపైనే కూరగాయలను కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. రైతు బజారు లేక కూరగాయాల క్రయ విక్రయాలకు అటు ప్రజలు, ఇటు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా సంత జరిగే సమయంలో ట్రాఫిక్ జామై వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. రైతు బజారు ఉంటే సాగుచేసిన కూరగాయాలను నేరుగా వినియోగదారులకు అమ్ముకునే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు. అలాగే రైతుకు గిట్టుబాటు, వినియోగదారులకు సరసమైన ధరలకు తాజా కూరగాయాలు లభించే వెసులుబాటు ఉంటుంది.

కేశంపేట మండల కేంద్రంలో రైతు బజారు లేక రైతులు తాము పండించిన కూరగాయాలను షాద్‌గనగర్, శంషాబాద్, గుడిమల్కాపూర్‌కు తరలించి ఏజెంట్ల వద్ద వారు ఎంత చెబితే అంతకు అమ్ముకుని వస్తున్నారు. ఇది రైతుకు నష్టం కలిగిస్తుంది. అంతేకాకుండా రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అయితే కొందరు రైతులు తాము పండించిన కూరగాయలను రోడ్లపై అమ్ముతూ ఇబ్బంది పడుతున్నారు. తాజా కూరగాయలపై దుమ్ము, ధూళి పడుతూ వండుకోవడానికి పనికి రాకుండా పోతున్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఇలా కూడా రైతులు నష్టపోతున్నారు. అంతేకాకుండా మెయిన్ రోడ్డుపై వారంతపు సంత నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ జాం అవుతుంది. దీంతో వాహన చోదకులు, కూరగాయాలు అమ్ముతున్న రైతులు, కొనుగోలుదారులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని రైతులు దశాబ్ద కాలంగా రైతు బజారు, మార్కెట్ ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం స్పందించి కూరగాయల విక్రయానికి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


రైతు బజారు ఏర్పాటు చేస్తే మేలు



కూరగాయాల విక్రయానికి రైతు బజారు ఏర్పాటు చేయాలి. రోడ్డుపై అమ్ముకోవాలంటే ఇబ్బందిగా ఉంది. వాహనాలు రాకపోకలతో కూరగాయలపై దుమ్మపడి ఎవరూ కొనడం లేదు.

- నక్క శేఖర్, రైతు

రోడ్డుపై విక్రయాలతో ఇక్కట్లు



రైతు బజారు ఏర్పాటుకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. రైతులు కూరగాయాలను రోడ్లపైనే అమ్ముతున్నారు. దీంతో ట్రాఫిక్ జాం అవుతుంది. కేశంపేటలో రైతు బజారు ఏర్పాటు ఎంతైన అవసరం.

తలసాని వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్

ప్రభుత్వం చొరవ చూపాలి



కేశంపేటలో రైతు బజారు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలి. సంతరోజు రోడ్డుపై కూరగాయల విక్రయం చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

శివాజీ, యువజన సంఘం నాయకుడు

గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ నియామకం

చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్దదైనా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డిని నియమించారు. అలాగే వైస్ చైర్మన్ పదవి సీహెచ్ భాస్కరాచారికి దక్కింది. సభ్యులుగా దోమలపల్లి అంజయ్య, మేకం లక్ష్మి, చిన్నారెడ్డి రఘుపతిరెడ్డి, చుంచు నర్సింహ, చిలుకూరి మహేంద్రారెడ్డి, మెగావత్ గణేష్, పి. జైపాల్‌రెడ్డి, కులపతి నవరాజ్, బండి మధుసూదన్‌రావు, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ ఇబ్రహీం, జి. వెంకటేశ్వర్లు, హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సభ్యులుగా నియమించారు.

ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలి

దోమ, సెప్టెంబరు 20: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో సుధీర్ తెలిపారు. శుక్రవారం దోమలోని బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమంపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రతీ విద్యార్థి ఆంగ్ల మాధ్యమంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుధీర్

బషీరాబాద్ సీహెచ్‌సీలో ఫ్యాన్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, సెప్టెంబర్ 20: బషీరాబాద్ సీహెచ్‌సీలో 'ఫ్యాన్లు లేక రోగుల అవస్థలు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పందించారు. స్థానిక నాయకులతో ఎమ్మెల్యే ఆరా తీసి నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్‌కు వెంటనే ఆస్పత్రి ఇన్‌పేషెంట్ వార్డులో ఫ్యాన్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురు, శుక్రవారాలు వార్డులు, మెయిన్‌హాల్, సిబ్బంది కూర్చునే గదుల్లో కొత్త ఫ్యాన్లు అమర్చారు. ఎమ్మెల్యే చొరవతో ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో రోగులు, సహాయకులు, వైద్య సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.



బషీరాబాద్ సీహెచ్‌సీలో ఏర్పాటు చేస్తున్న ఫ్యాన్

రోడ్డు పక్కన చెట్లు నరికివేత

ఆమనగల్లు, సెప్టెంబరు 20: మండల పరిధిలోని శంకర్ కొండ తండాలో గుర్తు తెలియని వ్యక్తులు హరితహారంలో భాగంగా నాటిన చెట్లను నరికి వేశారు. మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గుల్‌మొహర్(పెద్దవి) చెట్లను నాటారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు 30 చెట్లను నరికి వేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో కుసుమ మాధురి వాటిని పరిశీలించారు. శంకర్‌కొండ పంచాయతీ కార్యదర్శి విజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



శంకర్ కొండ వద్ద నరికివేసిన చెట్లు

అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరందించాలి

కులకచర్ల, సెప్టెంబరు 20: అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు అందించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలో ప్రతీ పనికి రికార్డు నమోదు చేయాలని తెలిపారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ అర్హులైన లబ్ధిదారులకు అందాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధులు, సీనియర్ సిటిజన్లకు విశిష్ట సేవలందిస్తున్న సంస్థలకు రాష్ట్రస్థాయి అవార్డులను అందజేస్తామని జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25లోపు దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 965239475 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వికారాబాద్‌లో ప్రధాన రైళ్లకు తాత్కాలిక హాల్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 29వరకు షాద్‌నగర్ సమీపంలోని శాంతివనంలో జరిగే అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం.. పలు ప్రధాన రైళ్లకు వికారాబాద్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ముంబై-భువనేశ్వర్, సికింద్రాబాద్-రాజ్‌కోట్ మార్గాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 24 నుంచి 30వ తేదీవరకు నిమిషం పాటు తాత్కాలిక హాల్ట్ ఉంటుందని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

వరిపైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 20 : మూసీ పరీవాహక ప్రాంత రైతులు రసాయనిక ఎరువులు వాడొద్దని రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు కాంతి కృష్ణవేణి, రాకేష్ సూచించారు. శాస్త్రవేత్తలు శుక్రవారం మునిప్పల్, కొర్రెముల్లో వరి పైర్లను పరిశీలించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పోటాష్‌ను ఎకరాకు 15నుంచి 20కిలోలు వేసుకోవాలన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 400గ్రాములు ప్రతీ ఎకరానికి నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఈవో మంజుల, జగదీష్, రైతులు బాల్‌రాజ్, శ్రీశైలం, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడాలి


మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

పరిగి, సెప్టెంబరు 20: విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని డీఈవో రేణుకాదేవి అన్నారు. యంగ్ ఓరిటర్స్ ఆధ్వర్యంలో పరిగిలోని జడ్పీ బాలికల పాఠశాలలో రెండురోజులుగా కొనసాగుతున్న వర్క్‌షాప్‌ను శుక్రవారం డీఈవో సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేలా చొరవచూపాలన్నారు. ఈ శిక్షణ తరగులు ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తాన్, ఎంఈవో హరిశ్చందర్, నోడల్ అధికారి గోపాల్, రిసోర్స్‌పర్సన్లు మోయిజ్‌ఖాన్, సంధ్యారాణి, వీణ, స్వప్న పాల్గొన్నారు.

బాల కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అనురాధ



వికారాబాద్, సెప్టెంబర్ 20 : వికారాబాద్ బాల కేంద్రం సూపరింటెండెంట్‌గా డ్యాన్స్ టీచర్ అనురాధను నియామిస్తూ బాలభవన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సూపరింటెండెట్ శ్రీకాంత్‌దీక్షిత్‌పై ఫిర్యాదుల రావడంతో ఆయన్ను తప్పించి అనురాధను ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని అనురాధను ఆదేశించారు.

పోలీసు ఉన్నతాధికారులతో గురునాథ్‌రెడ్డి సమావేశం


పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన గురునాథ్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 20: రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పోలీసు శాఖలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. పోలీస్‌స్టేషన్లు, సిబ్బంది, క్వార్టర్స్ నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఉన్నతాధికారులు రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన బాధ్యతలు సంతోషకరం


కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్, శుభప్రద్

వికారాబాద్, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో పార్టీ తరపున తనకు అధ్యయన బాధ్యతలప్పగించడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, తాను గాంధీ ఆసుపత్రి, రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి పరిస్థితులపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తాము ఇచ్చే సలహాలు సూచనలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

శుభప్రద్ పటేల్‌కు కేటీఆర్ అభినందన


శుభప్రద్ పటేల్‌ను సన్మానిస్తున్న కేటీఆర్

వికారాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ బీసీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారంటూ శాలువాతో సన్మానించారు. పార్టీలో గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని, పార్టీలో గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమం గురించి ఆలోచించేది బీఆర్ఎస్ పార్టీయే అని గుర్తు చేశారని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థుల ఆందోళన


సిరిపురం ఎస్సీ హాస్టల్‌లో తీసుకుంటున్న విద్యార్థులు

మర్పల్లి, సెప్టెంబరు 20: రోజూ తమకు నీళ్ల చారు, అన్నం పెడుతున్నారని సిరిపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు అన్నారు. కొన్ని రోజులుగా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. శుక్రవారం విద్యార్థులు మాట్లాడుతూ.. హాస్టల్‌లో 40 మంది విద్యార్థులే హాజరవుతున్నా హాజరు పట్టికలో మాత్రం 86 మంది విద్యార్థులు వస్తున్నట్టు చూపుతున్నారని తెలిపారు. చవితి సందర్భంగా విద్యార్థులు ఇళ్లకు వెళ్లారన్నారు. ఈ నెల 18న 26మందే వస్తే 70మందికి వచ్చినట్టు చూపారన్నారు. వార్డెన్ తుల్జారాంను వివరణ కోరగా హాస్టల్‌లో బయోమెట్రిక్ పనిచేయడం లేదని, మాన్యువల్‌గానే హాజరు వేస్తున్నామని చెప్పారు.

వంద ఫీట్లతో కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా రోడ్డు

నాలుగు లేన్ల విస్తరణ పనులు ప్రారంభం




కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా రోడ్డుకు కొనసాగుతున్న పనులు. (ఇన్‌సెట్‌లో) రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

కొత్తూర్, సెప్టెంబరు 20: ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి బైపాస్ రోడ్డులోని జేపీ దర్గా చౌరస్తా వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు గోతులమయంగా మారి, అస్తవ్యస్థంగా తయారు కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఇదే రోడ్డులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, పలు కాలనీలు ఉండడంతో రాకపోకలు అధికంగా ఉంటాయి. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని 1.04కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చేందుకు హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి రూ.18కోట్లు మంజూరయ్యాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అవి తొలగిపోవడంతో ఇటీవల తిరిగి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైనాయి. హెచ్ఆర్‌డీసీ సిబ్బంది రోడ్డు విస్తరణ పనుల కోసం మార్కింగ్ కూడా చేస్తున్నారు. వంద ఫీట్ల నాలుగు లేన్ల రోడ్డు విస్తరణలో భాగంగా 2మీటర్లతో డివైడర్, రోడ్డుకు అటు, ఇటు 2మీటర్లతో ఫుట్‌పాత్, ఒక మీటర్‌తో అటు, ఇటు డ్రైనేజీ పనులు చేపట్టేందుకు అధికారులు డిజైన్ రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య త్వరలో తీరిపోనుంది.

మైసమ్మగూడలో రోడ్డు వివాదం

- అక్రమ నిర్మాణాలకు

నోటీసివ్వాలని కమిషనర్ నిర్ణయం


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కాలనీవాసులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో రోడ్డు వివాదం కొత్త వివాదానికి తెరలేపింది. కాలనీ 20 ఫీట్ల రోడ్డుకు అడ్డంగా గోడకట్టారని కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ప్లాట్లను విక్రయించిన వెంచర్ వారికి, కౌన్సిలర్లను, గ్రామపెద్దలను పిలిచి మాట్లాడారు. కాగా ఈ లేఅవుట్‌కు అనుమతే లేదన్న విషయం బయట పడింది. మైసమ్మగూడలోని సర్వే నంబర్ 594, 595, 596 597లలో శ్రీరాములు, దుర్గేష్ తమ రెంఎకరాల్లో పదేళ్ల క్రితం లేఅవుట్ చేసి ప్లాట్లు అమ్మారు. కొంత స్థలాన్ని తమ వద్దే ఉంచుకున్నారు. ప్లాన్‌లో కాలనీలోకి ప్రవేశించే రోడ్డును గ్రామంలోని ఒక పక్క నుంచి చూపారు. సర్వే నంబర్ 594లో భూ యజమానుల స్థలం నుంచే కాలనీవాసులు, విద్యార్థులు రాకపోకలు సాగించారు. ప్రస్తుతం ఇక్కడ భూమి ధర పెరగటంతో భూయజమాని ఖాళీ స్థలంలో గోడను కట్టాడు. రాకపోకలు సాగించకుండా గోడకట్టారని కాలనీ వాసులు, హాస్టళ్ల యజమానులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

కమిషనర్ విస్మయం

కాగా కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలపై తెలుసుకున్న మున్సిపాలిటీ కమిషనర్ స్వామినాయక్ ఆశ్చర్యపోయారు. అనుమతులు లేకుండా ఐదారంతస్తుల బిల్డింగ్‌లు ఎలాకట్టారని భూ యజమానులను, ప్లాట్ల ఓనర్లను నిలదీశారు. వారందరికీ నోటీసులివ్వాలని కమిషనర్ నిర్ణయించారు. దీనిపై అక్కడే ఉన్న కౌన్సిలర్లు సైతం సమ్మతి తెలిపారు. సర్వే నంబర్ 594, 195, 596, 597లలో అక్రమంగా కట్టిన భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చి అవసరమైతే కూల్చివేయాలని కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, అమరం హేమంత్‌రెడ్డి, పెంటయ్య చెప్పటంతో నోటీసులిస్తామని కమిషనర్ తెలిపారు. దీంతో రోడ్డు సమస్య పరిష్కారానికి వచ్చి కొత్త సమస్యను కొని తెచ్చుకున్నామంటూ కాలనీ వాసులు, స్థలయజమానులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, బాల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో సుధాకర్‌రెడ్డి

జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక

బషీరాబాద్, సెప్టెంబర్ 20: బషీరాబాద్‌లోని జడ్పీ పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి క్రీడల ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంఈవో సుధాకర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఎంపికలో మొదటి రోజు అండర్-14 బాలబాలికలకు ఖోఖో పోటీలను నిర్వహించారు. అండర్-14, 17వాలీబాల్, కబడ్డీ, వివిధ విభాగాల్లో పరుగు పందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్ అంశాల్లో సెలెక్షన్లు జరుగనున్నాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారిని జోనల్‌స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ జె.అంబదాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు భాస్కర్, గంగయ్య, రాజశేఖర్, బుగ్గప్ప, జ్యోతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


కందుకూరు : కార్మికులతో కలిసి వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, సెప్టెంబరు 20: మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడునెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం నేతలతో కలిసి మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మండల విద్యాధికారి మనోహర్‌కు వినతి పత్రం ఇచ్చారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడునెలల బిల్లులు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఆగస్టు 21న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామని, ఐదు రోజుల్లో బిల్లులను వారివారి బ్యాంకు అకౌంట్లలో వేస్తామని హామీ ఇచ్చి నేటికీ బిల్లులు మంజూరు చేయకపోవడం ఏమిటని అన్నారు. ప్రభుత్వం ప్రతీనెల 5వ తేదీ వరకు బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్మికులు ప్రభావతి, శ్రీనివాస్, గీత, మంగ, అండాలు, కలమ్మ, అశ్విని, విజచ. భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

మేడ్చల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్‌లోని ఎస్-9 కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఎం.రాధిక శుక్రవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో బెల్‌స్టార్ కంపెనీ ప్రతినిధులు, సేల్స్ ఆఫీసర్లు, బ్రాంచ్ మేనేజర్, అకౌంటెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన జిల్లాకు చెందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. వేతనం రూ.15వేలు వరకు ఇస్తారన్నారు. యువతీ యువకులు పోర్టర్‌లో రిజిష్టర్ చేసుకొని హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9866465024 అనే నంబరులో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ అధికారుల నజర్

కులకచర్ల, సెప్టెంబరు 20: కులకచర్లలోని ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. గురువారం ఏసీబీ అధికారులు స్థానిక కార్యాలయంలో ఓ ప్రత్యేక కేసులో సందర్శించినట్లు సమాచారం. కొన్ని కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడుతన్నట్లు బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్, బిల్లుల జారీపై బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

4,712 మందికి రుణమాఫీ


రుద్రమూర్తి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ తాండూరు డివిజన్‌లో మూడో విడతలో 4,712 మంది రైతులకు వర్తించిందని తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2లక్షల వరకు మూడో విడతలో బషీరాబాద్-558 మందికి, కోట్‌పల్లి-703, పెద్దేముల్-767, తాండూరు-1871, యాలాల-813 మందికి మాఫీ అయిందని తెలిపారు. రుణమాఫీ కాని వారు 842 మంది రైతులున్నారన్నారు. దీనిపై ఏవోలు పనిచేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ కాలేదని ఎవరూ కార్యాలయానికి రావొద్దని, గ్రామాలకే ఏవో, ఏఈఓలు వచ్చి కుటుంబాల ఫొటోలు తీసుకుంటారని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏవో కొమరయ్య, ఏఈఓలు ఉన్నారు.

మత్స్యకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న జంగయ్య

కందుకూరు, సెప్టెంబరు 20: ఈనెల 25న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలో తలపెట్టిన మత్యకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులగాజుల జంగయ్య కోరారు. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు కాకి రాములు ఆధ్వర్యంలో స్థానిక ముదిరాజ్ భవనంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ సొసైటీలకు రూ.10లక్షలు వందశాతం సబ్సిడీపై మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో చెరువులు, కట్టలు కబ్జాలు, కాలుష్యానికి గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన రాష్ట్ర సదస్సుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యశాఖ సంఘం నేతలు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గూడూరు మాజీ ఎంపీటీసీ అనురాధ, ఆ సంఘం నేతలు కాకి మధుసూదన్, పిట్టల పాండు, కొర్వి సురేందర్, గొర్రెంక యాదయ్య, తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రికార్డులు నెలకొల్పాలి

బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పుష్పసింథల్‌కుమార్



క్రీడాకారిణికి మెమెంటో అందజేస్తున్న డైరెక్టర్ వెంకటమురికి

శామీర్‌పేట, సెప్టెంబరు 20 : పాఠశాల, కళాశాలల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి రికార్డులను నెలకొల్పాలని అంతర్జాతీయ జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి పుష్పసింథల్‌కుమార్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం ఉప్పరిపల్లిలోని ఎక్స్‌లెన్సియా కళాశాల గ్రౌండ్స్‌లో పాఠశాల డైరెక్టర్ వెంకటమురికి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ-7 బాస్కెట్ బాల్ బాలికల జాతీయ క్రీడాపోటీలను(20 నుంచి 23 వరకు) పుష్పసింతల్‌కుమార్ ప్రాంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు, పీఈటీలు క్రీడల్లోను నిరంతరం శిక్షణనిస్తు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆటలు ఆడే విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమిస్తారని తెలిపారు. క్రీడాపోటీల్లో గెలుపు ఓటముల సహజమని, వీటితో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్స్‌లెన్సియా పాఠశాల ప్రిన్సిపల్ నీరజకౌశిక్, సీఓఓ ఈశ్వరన్, బాయ్స్ క్యాంపస్ సెంటర్ హెడ్ రమేశ్, అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

హోరాహోరీగా తలపడ్డ క్రీడాకారిణులు

సీబీఎస్ఈ-7 క్లస్టర్ గర్ల్స్ బాస్కెట్ బాల్ క్రీడా పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల క్రీడాకారులు 1,300 మంది వరకు 77 టీమ్‌లుగా పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ జాతీయ బాస్కెట్ బాల్ క్రీడా పోటీలు ఈ నెల 23 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

23, 24న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

శంషాబాద్, సెప్టెంబరు 20 : మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 23, 24వ తేదీల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలకు మౌలిక సౌకర్యాలు దోహదం

షాబాద్, సెప్టెంబరు 20: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు, వసతులు ఉండాలని అమెజాన్ సెక్యూరిటీ హెడ్ జాన్ డయ్యర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ భవనాన్ని సూపర్‌వైజర్ సృజనవాణి, మాజీ సర్పంచ్ పూజితా శ్రీనివాస్‌గౌడ్, అమెజాన్ డేటా సెంటర్ హెడ్ తాతాజీ, కృష్ణచైతన్యలతో కలిసి శుక్రవారం వారు ప్రారంభించారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి


పరిగిలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పరిగి, సెప్టెంబరు 20: రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల మేల్కొలుపు యాత్ర శుక్రవారం పరిగి చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పది జిల్లాల వారీగా మాదిగల జనాభా ఎంతుంటే అంత రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కొన్ని జిల్లాల్లో మాదిగలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. 30ఏళ్ల క్రితం ఉన్న ఏడు శాతాన్ని ఇప్పుడు కూడా అమలుచేస్తే మాదిగలకు అన్యాయమే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు రమేశ్, నాయకులు కె.శ్రీను, పి.శ్రీనివాస్; బి.వీరేందర్, ఉపేందర్, సురేందర్, నరేష్, గణేశ్, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు న్యాయం

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు న్యాయం జరుగుతోందని పిడమర్తి రవి అన్నారు. కొడంగల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ పాత 10జిల్లాల్లోని మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రమేశ్‌బాబు, ఎన్.రమేశ్‌బాబు, సురేశ్, ప్రసాద్, జోగుగణేశ్, వజిత్, సాయిలు, చిన్నయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడాలి


రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయికుమార్‌చారి

కందుకూరు, సెప్టెంబరు 20: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడాలని, అన్నిరంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం జిల్లా నాయకులు తల్లోజు సాయికుమార్‌చారి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సన్మానించి విశ్వబ్రాహ్మణుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సాయికుమార్‌చారి తెలిపారు. నేడు తమ వృత్తి ద్వారా ఎలాంటి లాభం పొందడం లేదని, ప్రభుత్వ పరంగా సబ్సిడీలు అందించాలని, అన్ని రంగాల్లో చేయుతనందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

కందవాడలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి



చేవెళ్ల, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని కందవాడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కావ్యకృష్ణగౌడ్, సీనియర్ న్యాయవాది, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ శుక్రవారం చేవెళ్లలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్‌ను కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందవాడతో పాటు గుండాల, లక్ష్మీగూడ, సాయిరెడ్డిగూడ, నారాయణదాస్‌గూడ, మల్లారెడ్డిగూడ, పలుగుట్ట, ఎర్రోనికోటాల గ్రామాల్లో సుమారు 20 వేల జనాభా ఉంటుందని చెప్పారు. మండలంలోని ఆలూర్‌లో కేవలం ఒకటే ఆరోగ్య కేంద్రం ఉండడంతో గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఉప వైద్యాధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌సింగ్, నరేష్‌కుమార్, పద్మ, శివలీల, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలి


సైకిల్ పెట్రోలింగ్ సిబ్బందితో ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 20: ట్రాఫిక్ విషయంలో పోలీసులు మరింత అప్రమత్తతో ఉంటూ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద విజిబుల్ పోలీసింగ్, సైకిల్ పెట్రోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. సైకిల్ పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లు రమాదేవి, అశ్విని, మౌనికలను ఆయన అభినందించారు. విజిబుల్ పోలీసింగ్ చేస్తూ యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

కల్యాణ లక్ష్మితో ఆర్థిక భరోసా

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 20: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల కేంద్రంలో 104 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఆయన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్ల సందర్భంగా ఆర్థిక సాయం అందిస్తూ ఆదుకుంటోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్, అధికారులు, నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

కడ్తాల్, సెప్టెంబరు 20: కడ్తాల మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నేడు(శనివారం) ఉదయం 10 గంటలకు మైసిగండి దేవాలయం వద్ద ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ తెలిపారు. సమావేశంలో స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితర విషయాల చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 20: ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో షాద్‌నగర్ డివిజన్ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యం అందిస్తున్న విషయం తెలియక పేద మధ్యతరగతి కుటుంబాల వారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కొందరు చిన్న రోగాన్ని పెద్దగా చూపుతూ పేదల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసిబ్బంది నాణ్యమైన సేవలు అందించాల కోరారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయడంతోపాటు అన్నిరకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చామన్నారు. డీడీఎంహెచ్‌వో విజయలక్ష్మి తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నందిగామ : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం బండోనిగూడలో కాంగ్రెస్ నాయకుడు పసుల బుచ్చయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏమీ చేయలేక చేతులెత్తేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామంలో మౌలిక వసతులు కల్పించిందని, మహిళ సంఘం భవనం కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ నుంచి బుగ్గోనిగూడ వరకు బీటీరోడ్డు గుంతలమయమైందని, రూ.27 కోట్లతో డబుల్‌రోడ్డుగా నిర్మిస్తామని తెలిపారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు నర్సింలు, మాజీ ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, రాజు, శ్రీశైలం, రాజు, యాదయ్య, తిరుపతి, ఆంజనేయులు, పాండు, మల్లేష్, కుమార్, బాలకృష్ణ, శేఖర్ తదితరులున్నారు.



షాద్‌నగర్ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పెంజర్ల అండర్‌పాస్‌ను వంద ఫీట్లతో నిర్మించాలి

కొత్తూర్ : కొత్తూర్-షాద్‌నగర్ 44వ జాతీయ రహదారి 6లేన్ల విస్తరణలో భాగంగా పెంజర్ల చౌరస్తా వద్ద నిర్మాణం కాబోతున్న అండర్‌పాస్‌ను వంద ఫీట్లతో నిర్మించాలని కోరుతూ పెంజర్ల, ఎస్‌బీపల్లి, సిద్దాపూర్, కొడిచర్ల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అధికారులు చేసిన డిజైన్‌లో పెంజర్ల చౌరస్తా వద్ద 40 ఫీట్లతో అండర్‌పాస్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిసిందని, కందుకూరు సమీపంలో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు కాబోతుందని, కొత్తూర్ నుంచి పెంజర్ల వెళ్లే రోడ్డు ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా కేవలం 20 కిలోమీటర్లు మాత్రమే ఉంటుందన్నారు. రాబోయే కాలంలో పెంజర్ల రోడ్డు 4లేన్లతో విస్తరిస్తే, అండర్‌పాస్ వద్ద సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వంద ఫీట్లతో పెంజర్ల అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం చేయించేందుకు అధికారులతో సమావేశమవుతానన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఎస్‌బీపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్, సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, దేవేందర్ ముదిరాజ్, ఎర్రోళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాత ఆలయాభివృద్ధికి సహకారం

షాద్‌నగర్ రూరల్ : చరిత్రాత్మక దేవాలయం భవానీ మాత ఆలయాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత ఆలయం, హనుమాన్ ఆలయం నూతన పాలక వర్గాల ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో జరిగింది. ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ అధికారులు, పాలక వర్గం సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు. అనంతరం పాలక వర్గాన్ని సన్మానించగా.. వారు ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఈవో శివకుమార్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఆలయ కమిటీ చైర్మన్లు రాజు, దినేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్టు

ఆదిభట్ల, సెప్టెంబరు 20 : గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి పెద్ద మొత్తంలో సరుకు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ర్యావిరాలలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు ఆదిభట్ల పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడిచేశారు. చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన సంతోష్‌ను అదుపులోకి తీసుకొని కొద్ది మొత్తంలో గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు నేడు రాచకొండ సీపీ మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

పోలీసుల విధులకు ఆటంకం.. వ్యక్తిపై కేసు

కడ్తాల్, సెప్టెంబరు 20 : పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కడ్తాల స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. కడ్తాల మండలంలోని గోవిందాయపల్లి తండాలో గురువారం రాత్రి వినాయక నిమజ్జనం నిర్వహించారు. బందోబస్తుకు కానిస్టేబుల్ మహేష్, హోంగార్డు లక్ష్మణ్‌తండాకు వెళ్లారు. తండాకు చెందిన నేనావత్ సేవ్యా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిపై అసభ్య పదజాలంతో దూషించి దురుసుగా ప్రవర్తించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

వ్యక్తిపై దాడి.. మరొకరిపై కేసు

మాడ్గుల, సెప్టెంబరు 20 : మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన సాటు కుమార్ అతని స్నేహితుడు కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్ర రాజు అనే వ్యక్తిపై వ్యక్తిగత కారణాలతో నాగిళ్ల గ్రామంలో దాడి చేశారు. ఈమేరకు రాజు మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్టీ అకృత్యాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు. విషయం తెలుసుకొన్న ఇబ్రహీం పట్నం ఏసీపీ కేపీవీ రాజు దర్యాప్తులో భాగంగా శుక్రవారం గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

భార్యను కడతేర్చిన కేసులో భర్తకు జీవిత ఖైదు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 20: భార్యను కడతేర్చిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధించినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. షాద్‌నగర్ స్టేషన్ పరిధి అన్నారం శివారులోని గుండ్యా తండాకు చెందిన లలిత(30)ను ఆమె భర్త జఠావత్ రమేశ్ చెడు అలవాట్లకు బానిసైన అతడు భార్యతో తరచూ గొడవ పడేవాడు. 2020 అక్టోబరు 30న కత్తితో లలిత గొంతు, ఇతర శరీర భాగాలపై తీవ్ర గాయాలు చేశాడు. ఆమెను చంపాలనే ఉద్దేశంతో తీవ్రంగా గాయపరిచాడు. చుట్టు పక్కల వాళ్లు బాలానగర్ మండలం మేడిగడ్డ తండాలోని ఆమె తల్లికి చెప్పారు. అనంతరం లలితను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో 5 నవంబరు 2020న మృతి చెందింది. నేరం రుజువు కావడంతో రంగారెడ్డి సెషన్స్ కోర్టు శుక్రవారం రమేశ్‌కు జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవ్వాలి



ఆమనగల్లు : ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఆమనగల్లు, సెప్టెంబరు 20: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీడీవో కుసుమ మాధురి పిలుపునిచ్చారు. మురుగు నీటి కాల్వల శుభ్రత, ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల సంభవించే వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, వైద్య, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఐకేపీ కార్యాలయం వద్ద శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లు మండలాన్ని స్వచ్ఛ మండలముగా తీర్చిదిద్దుతామని ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

కేశంపేట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వేముల్‌నర్వ, కొత్తపేట, సంతాపూర్, కొనాయపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, నోడల్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

షాబాద్ : ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్ అన్నారు. మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో పంచాయితీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కేశంపేట : పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు



షాబాద్ : విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీవో వీరాసింగ్



కేశంపేట : మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

'శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ' బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కేశంపేట, సెప్టెంబరు 20: కలియుగ దైవం, తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ (ప్రసాదం) కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేశంపేట మండల కేంద్రంలోని ధవళగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలుపుతున్నట్లు వెలుగు చూసిందని తెలిపారు. కొవ్వు కలపడాన్ని హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని, కేంద్రం విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి శివాజీ, సభ్యులు జంగయ్యాచారి, గడ్డమిద్ది రాములు, బాలస్వామి, రాఘవేందర్ గుప్తా, సందీప్, యాదయ్య, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఆమనగల్లు : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి హిందువుల మనోభావాలను, విశ్వాసాన్ని దెబ్బతీసిన అంశంపై సిట్టింగ్ జడ్జితో సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పీఎం మోదీలకు ట్విట్టర్ వేదికగా విజ్ఞప్తి చేశారు. దేశంలోనే ఇది అత్యంత దుర్మార్గ చర్య అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నేదునూరులో ప్రొసీడింగ్స్‌ను అందిస్తున్న శమంత ప్రభాకర్‌రెడ్డి

పక్కాగా ఆరు గ్యారెంటీల అమలు

కందుకూరు, సెప్టెంబరు 20: ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి తూచా తప్పకుండా, పక్కాగా అమలు చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకం(సబ్సిడీ గ్యాస్) వర్తింపు కొరకు నేదునూరు, మాన్యగూడ గ్రామాల్లో మంజూరైన ప్రొసీడింగ్స్‌ను కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌తో కలిసి శుక్రవారం ఆయన అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ పాండురంగారెడ్డి, నాయకులు కె.రూప్‌చందర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, పి.యాదిరెడ్డి, వి.బాబు, నవాబ్, ఎండి మస్తాన్‌బాబా, కృష్ణానాయక్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మంచి పనులతో చిరస్థాయి కీర్తి



వెంకట్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 20: మంచి పనులతో సమాజంలో చిరస్థాయి కీర్తి లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రతీఒక్కరు ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీపాతి వెంకట్‌రెడ్డి సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు. వెంకట్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన విద్యారంగం అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, చల్లా రాంరెడ్డి, రఘుపతి రెడ్డి, పుల్లారెడ్డి, యాదగిరిరెడ్డి, నారాయణ రెడ్డి, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, తదితరులున్నారు.

జోనల్ స్థాయి క్రీడలకు వెల్జాల విద్యార్థుల ఎంపిక

తలకొండపల్లి, సెప్టెంబరు 20: మండల పరిధిలోని వెల్జాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుచెందిన 25 మంది విద్యార్థినీ విద్యార్థులు జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. 68వ ఎస్‌ఎఫ్‌ఐ జోనల్ స్థాయి పోటీల జట్ల ఎంపికకు తలకొండపల్లిలో కబడ్డీ, గట్టిప్పలపల్లిలో ఖోఖో సెలెక్షన్స్ నిర్వహించారు. ఆయా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ పరమేశ్ తెలిపారు. జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికైన వారిని శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు నసీమా, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

'పట్నం' మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



రైతులతో కలిసి చెత్తను ఊడుస్తున్న స్రవంతి, రవీంద్ర సాగర్

ఇబ్రహీం పట్నం, సెప్టెంబరు 20: పారిశుధ్యం విషయంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామని చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ పి.రవీంద్ర సాగర్‌లు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు వెజ్ మార్కెట్లో మున్సిపల్ సిబ్బంది, రైతులతో కలిసి చెత్తను తొలగించారు. ఆరుబయట చెత్త పారబోయవద్దని, బుట్టల్లో నిల్వ చేసి మున్సిపల్ వాహనాల్లో వేయాలని సూచించారు. సమస్యలుంటే ఫోన్లో మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెంటయ్యగౌడ్



పెంటయ్యగౌడ్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డమీది పెంటయ్యగౌడ్‌ను నియమించగా వైస్ చైర్మన్‌గా బేగరి రాములును నియమించారు. అలాగే కమిటీ సభ్యులుగా పడాల లలిత, తీగ యాదిరెడ్డి, ఎరుకల బాలయ్య, ఘనాపురం నరేందర్, ఎస్‌కే ఎండీ హనీఫ్, నక్కలపల్లి మల్లేష్, కొజ్జంకి సత్యనారాయణ, గోటూరి సుదర్శన్, కుర్వ యాదయ్య, తుమ్మలపల్లి జంగయ్య, కె.వెంకట్‌రెడ్డి, అక్నాపురం కృష్ణారెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, చేవెళ్ల ప్రత్యేకాధికారిని సభ్యులుగా నియమించారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



కార్యక్రమంలో జైపాల్ యాదవ్, తదితరులు

కడ్తాల్, సెప్టెంబరు 20: తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్, దివంగత సాయిచంద్ జయంతిని మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. మాజీ వార్డుసభ్యుడు హెచ్‌ఆర్ మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, సాయిచంద్ సతీమణి రజిని, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్‌లు పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు జోగువీరయ్య, మంగళపల్లి నర్సింహ, సాయిలు, లాయక్‌అలీ, అంజి, శ్రీను, మహేశ్, ఈర్షద్, కృష్ణ, సేవ్య పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా అంజయ్య

శంకర్‌పల్లి, సెప్టెంబరు 20: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీయూటీఎఫ్ మండలాధ్యక్షుడు అంజయ్య తెలిపారు. టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ రెడ్డిల సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని శంకర్‌పల్లిలో శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నందున ఆయన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, గౌరవ అధ్యక్షుడుగా శ్రీనివాస్‌రాజు, ఉపాధ్యక్షులుగా విజయ, మధుర, స్వప్నలు, సంయుక్త కార్యదర్శులుగా శంకరయ్య, రాజు ఎంపికయ్యారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గం

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల, సెప్టెంబరు 20 : లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిలా, షాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడిన బాధ్యులు ఈనెల 23 నుంచి 28 వరకు చేవెళ్ల కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమష్టి కృషితోనే ప్రగతి సాధ్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సోన శ్రీను నాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 20: సమష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యమని రాంనుంతల మాజీ సర్పంచ్ సోనశ్రీను నాయక్ అన్నారు. రాంనుంతల పెద్ద తండాలో జడ్పీ నిధులు రూ.4లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం మాజీ ఎంపీటీసీ సరిత పంతూనాయక్‌తో కలిసి సోన శ్రీను నాయక్ ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు శ్రీను నాయక్ చెప్పారు. మాజీ సర్పంచ్ హమ్లానాయక్, నాయకులు శేఖర్, యాదయ్య, వినోద్ కుమార్, దాసు నాయక్, గోపల్ నాయక్, కార్యదర్శి బాలమల్లేశ్ తదితరులున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



కడ్తాల : వేడుకల్లో లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్/కందుకూరు, సెప్టెంబరు 20: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి కాలనీలో శుక్రవారం గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజల అనంతరం లడ్డూ వేలం నిర్వహించి నిమజ్జన కార్యక్రమం చేశారు. మాజీవార్డు సభ్యుడు అశోక్, ఉత్సవ కమిటీ సభ్యులు సాయి, కృష్ణ, రామకృష్ణ, జంగయ్య, నరేశ్, తదితరులున్నారు. అలాగే కందుకూరు మండలం దెబ్బడగూడ, బాచుపల్లిలో గురువారం రాత్రి గణేష్ నిమజ్జనం జరుపుకున్నారు. దెబ్బడగూడలోని వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. అంతకుముందు లడ్డూను కెళ్లె జంగారెడ్డి కుమారులు యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డిలు రూ.2లక్షలకు దక్కించుకున్నారు. బాచుపల్లిలో యువసేనా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లడ్డూను వేలం వేయగా అదే గ్రామానికి చెందిన నరేష్ రూ.51వేలకు దక్కించుకున్నాడు. మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సురేష్, బీజేపీ నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, కె.జంగారెడ్డి, కొలన్ విఘ్నేశ్వర్‌రెడ్డి, కె.రవికాంత్‌రెడ్డి, ఎ.కృష్ణ, కె.రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, సురేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, రాంరెడ్డి, ఇంద్రసేనా రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



షాబాద్, సెప్టెంబరు 20 : మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలను మండల కేంద్రంలో ముస్లింలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. షాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సై నవీన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మృతికి సబితారెడ్డి నివాళి



అంజయ్యను పరామర్శిస్తున్న సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 20 : పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జి.రాములమ్మ అనారోగ్యంతో మరణించింది. శుక్రవారం తిమ్మాపురంలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై మృతురాలి కుటుంబ సభ్యులు పీఏసీఎస్ డైరెక్టర్ అంజమ్మ, మాజీ సర్పంచ్ జి.జయమ్మ అంజయ్యలను పరామర్శించింది. మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్.సురేందర్‌రెడ్డి, టి.దేవేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ బదిలీ

● నూతన ఎస్సైగా సంతోష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

చేవెళ్ల, సెప్టెంబరు 20 : సైబరాబాద్ పరిధిలోని ఎస్సైల బదిలీల్లో భాగంగా చేవెళ్ల ఎస్సై-2గా పని చేస్తున్న ప్రదీప్ కుమార్ గచ్చిబౌలిలోని యాడబ్ల్యూసీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న సంతోష్‌రెడ్డి చేవెళ్ల ఎస్సై-2గా నియమితులైయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై ప్రదీప్‌కుమార్ రిలీవ్ కాగా.. కొత్త ఎస్సై సంతోష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

రెడ్డి సేవా సమితి భవన నిర్మాణానికి విరాళం

తలకొండపల్లి, సెప్టెంబరు 20: మండల పరిధిలోని రాంపూర్‌లో నూతనంగా నిర్మించిన రెడ్డి సేవా సమితి భవనానికి కల్వకుర్తి తాలుకా రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు పసుల శేఖర్‌రెడ్డి చేయూతనందించారు. శుక్రవారం రూ.50,016 విరాళం రెడ్డి సేవా సమితి నాయకులకు అందజేశారు. శేఖర్‌రెడ్డిని రాంపూర్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు చిన్న హరిమోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఫోర్త్‌సిటీ నిర్మాణంతో శరవేగంగా కడ్తాల అభివృద్ధి

కడ్తాల్, సెప్టెంబరు 20: పారిశ్రామికంగా కడ్తాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఫోర్త్ సిటీ ఏర్పాటుతో కడ్తాల ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మైసిగండి మైసమ్మ దేవస్థానం వద్ద ప్రవీణ్ నాయక్, విక్రమ్ నాయక్, కృష్ణనాయక్, గన్ శంకర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని శుక్రవారం శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.